www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 14 నవంబర్ 2024
5
వైఎస్ఆర్

ఎంపి అవినాష్‌రెడ్డి పిఎ రాఘవరెడ్డి కోసం కొనసాగుతున్న గాలింపు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్ : కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బండి రాఘవరెడ్డి కోసం పోలీసులు గాలింపు కొనసాగుతోంది. సామాజిక మాధ్యమాలలో అసభ్యకర పోస్టులు వర్రా రవీందర్‌రెడ్డి ఇచ్చిన వాంగ్మూలం మేరకు రాఘవరెడ్డి కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. బుధవారం తెల్లవారుజామున నుంచి రాఘవరెడ్డి కోసం పులివెందుల, లింగాల మండలాలలో గాలిస్తున్నారు. అతని స్వగ్రామమైన అంబకపల్లెలో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. ఈ కేసులో ఆరోపణలు ఉన్న వ్యక్తుల కోసం కూడా పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం. పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలు, పోలీసులతో కలిసి జల్లెడ పడుతున్నారు.

రైతు ప్రయోజనాలే కీలకం : కలెక్టర్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

రైతుల ప్రయోజనాల కోసం అడుగులు వేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి సమీపంలో ఉన్న అరటి ఇంటిగ్రేడ్ ప్యాకింగ్ హౌస్, ప్రాసెసింగ్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈ యూనిట్ వల్ల రైతులకు ఎంత మేరకు ప్రయోగం కలుగు తుందనే విషయాలపై సంబంధిత రైతులు, వ్యవసాయ శాఖ అధికారులతో ఆరా తీశారు. మార్కెటింగ్, దిగుబడి, ఆదాయాలు, అరటి స్టోరేజ్ విధానం, ఎగుమ తులు తదితర వాటి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రైతులకు మేలు జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్‌డిఒ భానుశ్రీ, తహశీల్దార్ నజీర్ బాష, వ్యవసాయ అధికారులు, టిడిపి మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, పలు శాఖలకు సంబంధించిన అధికారులు రైతులు పాల్గొన్నారు.

పులివెందుల అభివృద్ధికి సహకరించండి : పులివెందుల అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్లు కలెక్టర్ శ్రీధర్‌ను కోరారు. పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం పాడాను రద్దు చేయడంతో మున్సిపాలిటీలో వాటర్ గ్రిడ్ పనులు నిలిచిపోయాయని, రోడ్లు, కొన్ని ముఖ్యమైన అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యలు విన్న కలెక్టర్ పరిశీలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్లు పార్నపల్లి కిషోర్, ఖాదర్‌బాష, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు

వేముల : రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి అధునాతన వ్యవసాయ పద్ధతులను, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను ఉపయోగించుకోవాలని కలెక్టర్ శ్రీధర్ అన్నారు. బుధవారం మండలంలోని వి.కొత్తపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. అరటి, పూల తోటలను

అరటి ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

పరిశీలించారు. రైతుల అవలంబించే అధునాతన వ్యవసాయ పద్ధతులు ద్వారా చామంతి, అరటి తోటలో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పండించే పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించే దిశగా, సకాలంలో మార్కెటింగ్ ఉండే దిశగా చేస్తామన్నారు. ప్రతి రైతు సేవ కేంద్రం పరిధిలో రైతులందరినీ ఒక గ్రూపుగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. డ్రోన్ ద్వారా పంటలకు పిచికారి చేయడం డెమో ద్వారా చేసి రైతులకు చూపించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ భానుశ్రీ, జెడిఎ నాగేశ్వరావు, ఉద్యాన శాఖ జిల్లా అధికారి సుభాషిని, ఎపిఎంఐపి పీడీ వెంకటేశ్వర్‌రెడ్డి, తహశీల్దార్ ఇందిరా రాణి, ఎడిఎ ప్రభాకర్‌రెడ్డి, ఎఒ చెన్నారెడ్డి, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, ఆర్ఐ ప్రసన్న, విఆర్ఒ రామచంద్ర, టెక్నికల్ వ్యవసాయ అధికారి సునీల్ కుమార్‌రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి రాఘవేందర్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జి రామ్మోహన్, రైతులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులను తొలగించాలి : డివైఎఫ్ఐ

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని

ప్రజాశక్తి-బద్వేలు

ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్లక్ష్యంగా డ్యూటీ చేస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్లక్ష్యంగా డ్యూటీలు చేస్తున్న అధికారులను విధుల నుండి తొలగించాలన్నారు. నాలుగు రోజుల క్రితం చికిత్స కోసం నాలుగేళ్ల జితేష్ కుమార్‌ను తల్లిదండ్రులు దగ్గు గొంతు నొప్పితో ఆసుపత్రికి వైద్యానికి తీసుకువెళ్తే ట్రీట్మెంట్ అనంతరం మెడిసిన్ ఇచ్చారు. మందులు తీసుకొని ఇంటికి వెళ్లిన అబ్బాయికి వాంతులు కావడంతో ప్రయివేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇచ్చిన సిరప్‌ను చెక్ చేయగా గడువు ముగిసింది ఇవ్వడంతోనే బాబు అస్వస్థతకుగురయ్యారని తల్లిదండ్రులకు డాక్టర్ చెప్పారు. ఇంత నిర్లక్ష్యంగా డ్యూటీ చేస్తున్న అధికారులపై నాలుగు రోజులు అవుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని దాని వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని వారు వైద్య శాఖ అధికారులు ప్రశ్నించారు మందులు ఎక్స్పైర్ అయినా చూసుకోకుండా అలా ఎంతమందికి ఇచ్చారని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్ గారు అయినా బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిపై చొరవచూపి అలాంటి వారిని తొలగించాలని డిమాండ్ చేశారు. అట్లూరు, గోపవరం, బద్వేలు, బి.కోడూరు మండలాలకు సంబంధించిన పేద ప్రజలు వారికి ఏదైనా జబ్బు జలుబు జ్వరాలు వస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చూపించుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి వారు ఉండటం వలన వారికి ఏదైనా జరగరానిది జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా డ్యూటీలు చేస్తూ వేలకు వేల రూపాయలు జీతాలు తీసుకుంటూ మందులపై దృష్టి పెట్టకుండా ఏ మందులు ఇస్తున్నామా లేదా అని చూసుకోకుండా ఎలా పడితే అలా మందులు ఇవ్వడం జరుగుతుందని అలా జరగకుండా జిల్లా వైద్య శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె.మస్తాన్, షరీఫ్. ఎస్.కె.ఆదిల్, బద్వేల్ రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు ముడమాల ఓబుల్‌రెడ్డి, ఉప్పులూరు బాల గురయ్య, మహిళ కో-కన్వీనర్ ఎస్కే ఫాతిమా, సాయి లక్ష్మి, పట్టణ ఉపాధ్యక్షులు ఎస్కే షబ్బీర్, సహాయ కార్యదర్శి నాగేంద్ర బాబు పాల్గొన్నారు

ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేసుకుందాం

- ఎల్ఐసి ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేసుకుందామని, ఎల్ఐసి యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న సాయంత్రం 5.30 నుంచి 8 గంటల వరకు కడప రాజీవ్ పార్క్ దగ్గర జరిగే కళాజాతా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు నాగమునిరెడ్డి, ఎల్ఐసి పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.సుధీకర్ అన్నారు. బుధవారం పాత కలెక్టరేట్ ఎదుట ఉన్న ప్రభుత్వ పెన్షనర్ల సంఘ కార్యాలయ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు నారాయణ ఆధ్వర్యంలో పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్ఐసి పొదుపుపై జీఎస్టీ తొలగించాలని, ఎఫ్‌డిఐ పరిమితి పెంచే ఆలోచన విరమించాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక ఆర్టీసీ ఆవరణలో ఆర్టీసీ పెన్షనర్ల సమావేశంలో రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బందికి విలీనం వల్ల హామీ ఇచ్చిన ప్రయోజనాలు ఇంకా నెరవేరాల్సి ఉందన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఉపాధ్యాయులను కళాజాతా కార్యక్రమానికి సమీకరిస్తున్నామని జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ అన్నారు.

కళాజాత కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పెన్షనర్ల సంఘం నేతలు

విద్య, ఆరోగ్య రంగాలు, ప్రభుత్వ రంగంలో ఉండాలన్నది కళాజాత ప్రచార లక్ష్యాల్లో ఒకటని అన్నారు. ఎల్ఐసి యూనియన్ కార్యాలయావరణలో మహిళా సంఘాల మరో సమావేశంలో జెవివి, ఐద్వా, శ్రామిక మహిళ, అంగన్వాడీ సంఘాల నేతలు కళాజాత పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘాల నేతలు వసుప్రద, పర్వీన్, సుబ్బమ్మ, సునీత, లక్ష్మీదేవి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు బలోపేతమైతేనే మహిళలకు ఉద్యోగ భద్రత, సమాన హక్కులు, శ్రమదోపిడి ఉండవన్నారు. సమావేశాలలో నాయకులు నారా యణ, మల్లయ్య, సుభాన్, సుబ్బరాయుడు, నాగయ్య, పుల్లయ్య, రమణ శీను పాల్గొన్నారు.

పాఠ్యాంశంగా 'వీరబ్రహ్మం సంఘసంస్కరణ' : 'మూల'

మాట్లాడుతున్న మూల మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

తాను పరిశోధన చేసి వెలువరించిన శ్రీ వీరబ్రహ్మేంద్రుని తాత్విక దార్శనికత అనే గ్రంథం నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి జీవితం-సంఘసంస్కరణ అనే అంశాన్ని శ్రీహరి డిగ్రీ కళాశాల విద్యార్థులకు పాఠ్యాంశంగా ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. బుధవారం వీరబ్రహ్మేంద్ర స్వామిపై ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చేటందుకు శ్రీహరి డిగ్రీ కళాశాల వారు ఆయనను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17వ శతాబ్దంలో బ్రహ్మంగారు చేసిన సంఘసంస్కరణ ప్రశంసనీయమని, ఈరోజు పదను, పసగల ప్రతి ఉద్యమానికి ఎప్పుడో 17వ శతాబ్దంలోనే వీరబ్రహ్మేంద్రస్వామి వారు స్వీకారం చుట్టారని పేర్కొన్నారు. ఆ కాలంలోనే ఆయన స్త్రీ సమాన ప్రతిపత్తి కోసం కృషి చేశారని, గరిమిరెడ్డి అచ్చమ్మని మొదటి శిష్యురాలిగా చేర్చుకున్నారని తెలిపారు. సర్వకుల, సర్వమత సమానత్వానికి పాటుపడ్డారని, దూదేకుల సిద్దయ్యను, దళితుడైన కక్కయ్యను శిష్యులుగా చేర్చుకోవడం ఆయన మహోన్నత వ్యక్తిత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. బ్రహ్మంగారు బాల్య వివాహాలను ఖండించారని, మాతృ పూజకు మించిన దైవం లేదన్నారని, అస్పృశ్యత నివారణకు కృషి చేశారని, జంతు బలులను నిషేధించారని, గురువు ప్రాధాన్యతను నొక్కి చెప్పారని తెలిపారు. మూఢ విశ్వాసాలను ఖండించారని పేర్కొన్నారు. వీర గురుడు మానవ మను గడకు ఉపయోగపడే ఎన్నో నైతిక విలువలను బోధించారని, నవ సమాజ నిర్మాణానికి కృషి చేశారని, స్వామి వారు చెప్పిన కాలజ్ఞానం చాలా ప్రసిద్ధమైందని చెప్పారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు జయప్రకాశ్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు : జడ్జి

ప్రజాశక్తి-కడప : మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ సూచించారు. కడప నగరంలోని బిల్డప్ సర్కిల్ వద్ద మత్తు పదార్థాల వ్యసనా నిర్మూల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జడ్జి బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ నల్సా మాదకద్రవ్యాల దుర్వినియోగం, మాదక ద్రవ్యాల నిర్మూలన పథకం 2015, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, మత్తు పదార్థాల వ్యసనానికి గురైన వారికి ఈ కేంద్రంలో కౌన్సిలింగ్ చికిత్స, పునరావాసం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఆర్.వి.కృష్ణ కిషోర్, మత్తు పదార్థాల వ్యసన నిర్మూలన కేంద్రం నిర్వాహకులు, వైద్యులు, ఎన్జీవోలు పాల్గొన్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి -గోపవరం : కేన్సర్‌పై జరగనున్న ఇంటింటి సర్వేకు ప్రజలు వైద్య సిబ్బందికి సహకరించాలని తొట్టిగారిపల్లె వైద్య అధికారి వినయ్ కుమార్ అన్నారు. పట్టణంలోని తొట్టిగారిపల్లె పిహెచ్‌సిలో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడుతూ కేన్సర్‌ను అంతమొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రొమ్ము, నోటి, గర్భాశయ కేన్సర్లను తొలి దశలోనే గుర్తించి వైద్యం అందిస్తామన్నారు. ఇతర వ్యాధులపై, ఆహార అలవాట్లపై సర్వే నిర్వహిస్తామని తెలిపారు. ఈ సర్వే వారానికి మూడు రోజులు దాదాపు 9 నెలల పాటు జరుగుతుందన్నారు. ఈ సర్వేకు ప్రజలందరూ సహకరించి సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు విశ్వంత్ పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-కడప అర్బన్ : కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డి పెద్దదర్గా ఉరుసు ఉత్సవాల ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. మాచుపల్లి బస్టాండ్, మాసాపేట, సర్కిల్, శివలింగం బీడీ ట్యాంకు, కళాక్షేత్రం, వై.వి.స్ట్రీట్ సర్కిల్ ప్రాంతాలను ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, సానిటేషన్ శాఖల అధికారులతో కలిసి తనిఖీ చేశారు. మాచుపల్లి బస్టాండ్ సమీపంలోని ఖాళీ స్థలాన్ని శుభ్రపరచి, ఆ ప్రదేశంలో ఫుడ్ కోర్టు ఏర్పాటు చేయాలనే ఆదేశించారు. రాయలసీమ ప్రాంతానికి ప్రత్యేకమైన రుచులను ప్రజలకు అందించేలా కౌంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఉరుసు జరుగనున్న ప్రాంతం, ఆ ప్రాంతపు మార్గాలను కూడా పూర్తిగా శుభ్రపరిచేందుకు సానిటేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. మాసాపేట సర్కిల్ వద్ద చెత్త తొలగించి, పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మునిరత్నం, రెవెన్యూ ఆఫీసర్ కన్నయ్య, విజయభాస్కర్ గౌడ్, ఇంజినీరింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు నుంచి కడపను కాపాడండి : కాంగ్రెస్

ప్రజాశక్తి-కడప

మాట్లాడుతున్న మహమ్మద్ అలీఖాన్

కడప జిల్లా కేంద్రమైన కడప నగరాన్ని భారీ వర్షాలకు ముంపు బారి నుండి రక్షించాలని, కంపు బారీ నుండి కూడా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం, కడప కార్పొరేషన్ పాలకవర్గంపై ఉందని ఎపిసిసి ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్ అలీఖాన్ హెచ్చరించారు. డిసిసి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాధారణ వర్షపాతానికి కూడా కడప నగరం రోడ్లు జలమయం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పలుమార్లు జలప్రళయం సంభవించినప్పటికీ జిల్లా యంత్రాంగం, కడప నగరపాలక సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. భారీ వర్షాలకు కడపలోని లోతట్టు ప్రాంతాలు, స్థానిక ప్రజలు భయభ్రాంతులకు లోనవు తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.69 కోట్ల అంచనాతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో 23 ప్రధాన వరద కాలువల నిర్మాణం చేపట్టడానికి సంకల్పిం చారన్నారు. ఎమ్మెల్యే మాధవి, మేయర్ సురేష్ బాబు మధ్య ఆధిపత్య పోరు జరుగుతోందని విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. స్థానిక సమస్యలతో ప్రజలు సతమతమవుతుంటే టిడిపి, వైసిపి ఆదిపత్య పోరు కొనసాగించ దాన్ని ఖండిస్తోందన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ ఎం.రహమతుల్లా ఖాన్, నాయకులు చిన్న కులాయప్ప, శ్యామలమ్మ, సంజయ్ కాంత, రఫీ ఖాన్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు వీల్ చైర్స్ పంపిణీ

ప్రజాశక్తి-కడప : కడప జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా హియరింగ్ మిషన్స్, వీల్ చైర్స్, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్, ట్రై సైకిల్‌లను సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కడప నగరం ద్వారకా నగర్‌లోని ఆశ్రయ ఆకృతి ప్రత్యేక పాఠశాల, ఓల్డ్ రిమ్స్‌లోని ఆల్ షీఫా మానసిక వికలాంగుల కేంద్రం, దర్శిని హ్యాండీక్యాప్డ్ వెల్ఫేర్ సొసైటీ స్పెషల్ ఫర్ హియరింగ్ అండ్ మెంటలీ రీటా డెడ్‌లో బుధవారం వైద్యాధికారులచే ఆడియో మెట్రేషన్ టెస్టులు, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఆర్.వి.కృష్ణ కిషోర్, ఆడియాలజిస్ట్ అండ్ స్పీచ్ తెరపిస్ట్, ఆశ్రయ ఆకృతి ప్రత్యేక పాఠశాల, ఆల్ షీఫా మానసిక వికలాంగుల కేంద్రం, దర్శిని హ్యాండీక్యాప్డ్ వెల్ఫేర్ సొసైటీ స్పెషల్ ఫర్ హియరింగ్ అండ్ మెంటలీ రేటర్డెడ్ నిర్వాహకులు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బకాయిలు చెల్లించండి : ఎస్‌టియు

ప్రజాశక్తి-కడప అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని ఎస్‌టియు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.ఎం.డి.ఇలియాస్ బాషా, నర్రెడ్డి సంగమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎస్‌టియు కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ బీమా సంస్థలో పాలసీ కాలపరిమితి పూర్తయిన తర్వాత చెల్లించాల్సిన క్లెయిమ్స్, ఒక ఉద్యోగి మరణించిన తర్వాత ఆ కుటుంబానికి అందాల్సిన ఇన్సూరెన్స్ వ్యాల్యూ అందించక రెండు సంవత్సరాలు అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిది నెలలుగా ప్రావిడెంట్ ఫండ్ సంబంధించి పదవి విరమణ చెందిన ఉద్యోగుల ఫైనల్ పేమెంట్లు గానీ, పిల్లల వివాహాలకు చదువుల కొరకు ప్రావిడెంట్ ఫండ్‌లో దాచుకున్న సొమ్మును లోన్ రూపంలో పొందాలనుకునే వారికి కానీ 8 నెలలుగా చెల్లింపులు లేవని తెలిపారు. గత ప్రభుత్వం మాదిరి కాకుండా ఈ ప్రభుత్వమైనా ఉద్యోగుల సంక్షేమంపై శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు మహబూబ్ బాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు సాదిక్ అలి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

ప్రజాశక్తి-కాశినాయన

మాట్లాడుతున్న మూల రామకృష్ణారెడ్డి

విద్యార్థులు పట్టుదలతో కష్టపడితే అనుకున్నది తప్పక సాధిస్తారని సైకాలజిస్ట్, ఎస్‌టియు నాయకుడు మూల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు బుధవారం మండల కేంద్రమైన నరసాపురంలోని ఎపి మోడల్ పాఠశాలలో 9, 10వ తరగతి చదివే విద్యార్థులకు ప్రిన్సిపల్ సౌజన్య ఆధ్వర్యంలో నైతిక విలువలు క్రమశిక్షణ, కార్యదక్షత లక్ష్యసాధనపై మంచి ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పట్టుదలతో క్రమశిక్షణతో శ్రమిస్తే విజయం మీ చెంత చేరుతుందని తెలిపారు. అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. పిల్లలు నైతిక విలువలతో పెరగడం ఎంతో అవసరమని విద్యార్థులు భవిష్యత్తులో సమాజ హితం కోరే వ్యక్తులుగా మారాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల విద్యా శాఖ అధికారి నిర్మల, ఎస్‌టియు సిపిఎస్ కమిటీ కన్వీనర్ యు.సుబ్రమణ్యం, నాయకులు రమణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు పుష్పగిరికి ప్రత్యేక ఆర్టీసీ బస్సు

ప్రజాశక్తి-కడప అర్బన్ : కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈ నెల 15వ తేదీ పుష్పగిరి క్షేత్రానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీస్ నడుపుతున్నట్లు ఆర్ఎం గోపాల్‌రెడ్డి ఒక ప్రకటన తెలిపారు. ఉదయం ఆరు, ఏడు గంటలకు కడప నుంచి బయలుదేరుతుందని పేర్కొన్నారు. మైదుకూరు నుంచి ఆరు, ఏడు గంటలకు బస్సు సర్వీసు ఉంటుందని తెలిపారు. ప్రయాణికులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రజలను దగా చేసిన వైసిపి : టిఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి-కడప అర్బన్ : వైసిపి ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లకుండా ఓట్లు వేసిన 1.32 కోట్లమంది ప్రజల నమ్మకాన్ని ఒమ్ము చేశారని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి అధినేత జగన్, వారి ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లకపోవడం వారికి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను మోసం చేయడమేనన్నారు. ప్రజా ఓట్లతో ఎన్నికైన వైసిపి ఎమ్మెల్యేలు శాసనసభ సమావేశాలలో పాల్గొనకుండా, ప్రజల గొంతుక కానప్పుడు నీతి, నిజాయితీ గలవారైతే తమకు జీతాలు, గన్ మెన్లు, ఇతర సదుపాయాలు ఏవి వద్దని స్పీకర్‌కు లేఖ రాసి వారి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. వైసిపి ఎమ్మెల్యేలు తమకి ఓట్లు వేసిన ప్రజల కోసం అసెంబ్లీకి వెళ్లి బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజా సమస్యలపై మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చేతన్ కుమార్ రెడ్డి, రెడ్డి భార్గవ్, అధికార ప్రతినిధి సిద్ధార్థ రాయల్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఫరీద్, హర్ష, ఆసిఫ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు తిరుమలేష్

జంతుశాస్త్ర విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-కడప : జలాచరజీవులు, పోషకాల విధులపై ప్రభుత్వ పురుషుల కళాశాలలోని జంతుశాస్త్ర విద్యార్థులకు చేపలను నిలువ చేసే విధానంపైన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నెల్లూరులోని సి ఫైట్స్ ఫిషరీస్ ఇండస్ట్రీస్‌లో నిర్వహించారు. సి బైట్స్ ఫిషరీస్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ శరత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపలలోని పోషకాల విలువలు వాటిని నిలువ చేసే విధానం, వివిధ అంశాల మీద శిక్షణకు హాజరైనట్లు కడప ప్రభుత్వ పురుషుల కళాశాల జంతుశాస్త్ర విభాగధిపతి డాక్టర్ పి.రవి శేఖర్ తెలిపారు. శిక్షణ నిర్వాహకుడు శరత్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ చేపలు, రొయ్యలలో పోషకాల విలువలు అధికంగా ఉంటాయని రోగ నిరోధక శక్తిని అధికంగా కలిగి ఉంటాయని పేర్కొన్నారు. డిబిటి స్టార్ కో-ఆర్డినేటర్ సావిత్రి మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ కార్యక్రమాల ద్వారా విద్యార్థులు శిక్షణ నైపుణ్యాలు పెంపొందించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు మహేష్, విద్యార్థులు లోకేష్, వినోద్, పవన్ కుమార్, అఖిల్ ప్రమోద్ ప్రశాంత్, కొండయ్య, నారాయణ, శ్రీకాంత్, శివ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కడప అర్బన్ : కమలాపురం పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన పి.ఆంజనేయులు నాయక్(హెచ్‌జి 2083) కుటుంబానికి రూ.2.5 లక్షల ఆర్థిక సాయాన్ని ఎఎస్‌పి కె.ప్రకాష్ బాబు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందచేశారు. పోలీసు వితరణ నిధి నుంచి ఈ ఆర్థిక సాయం అందచేశారు. హోంగార్డు ఆంజనేయులు నాయక్ మాతృమూర్తి పి.ధార్మికి ఆర్థిక సాయం అందచేశారు. హోంగార్డుల సంక్షేమంలో భాగంగా ఈ మొత్తాన్ని అందచేశారు. ఎఎస్‌పి హోంగార్డు ఆంజనేయులు కుటుంబ యోగక్షేమాలు విచారిం చారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ పరిపాలనాధికారి ఎన్.జ్యోతి, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, సూపరింటెండెంట్ శ్రీనివాసులు నాయక్, జూనియర్ అసిస్టెంట్ మహజబీన్ పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సహకరించండి : ఎంపిపి

ప్రజాశక్తి-కాశినాయన

మండల అభివృద్ధికి ప్రతి అధికారి సహకరించాలని ఎంపిపి పోలమ్మ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన వెలుగు కార్యాలయ సభా భవనంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అధికారి మండల అభివృద్ధికి సహకరిస్తేనే అభివృద్ధి చెందుతుందని ఈ విషయం అధికారులంతా గమనించాల్సిన అవసరం ఉందన్నారు ఎంపిడిఒ మైథిలి మాటాడుతూ అధికారుల అందరు వారి ఉద్యోగ రీత్యా విధి విధానం మార్చుకోవాలని తెలిపారు కొందరు అధికారులు యొక్క సమావేశాలకు హాజరు కావడం లేదని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలకు ఒక సారి సమావేశం ఏర్పాటు చేస్తే ఇరిగేషన్ అధికారులు ఏ ఒక్క సమావేశానికి కూడా హాజరు కాకపోవడం చాలా బాధాకరమైన విషయమన్నారు. వారి విషయాలపై ఇక్కడ ప్రజాప్రతినిధులు ఏమైనా అడిగితే మేము ఏమి సమాధానం చెప్పాలో వారు ఆలోచించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మళ్లీ జరగబోయే మండల సమావేశానికి అన్ని శాఖల అధికారులు వారి యొక్క సమాచారాన్ని మండల సమావేశం మూడు రోజుల ముందే మాకు ఇవ్వాలన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రజలు అడిగిన సమస్యలు ఎంతవరకు పరిష్కారం అయ్యాయో ఆ రోజు సమాధానం చెప్పాలన్నారు. డిప్యూటీ తహశీల్దార్ రవిశంకర్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు ఏవైనా ఉంటే అవి నియమ నిబంధనలతో కచ్చితంగా పరిష్కరిస్తామన్నారు. వైద్యాధికారి ప్రశాంతి మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి విషయంపై ప్రతి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి పోలమ్మ

కుటుంబాన్ని సందర్శించి సర్వే చేసి పరీక్షలు నిర్వహించి వారికి తగు సూచనలు సలహాలు ఇచ్చి అవసరమైతే వారిని పిహెచ్‌సి కి పిలిపించి తగు మందులు ఇస్తామన్నారు. ఈ వ్యాధి వయసుతో సంబంధం లేకుండా వస్తుందని తెలిపారు. సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మండల ఉపాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి వెంకటసుబ్బయ్య, పిఆర్‌జెఇ బాల పుల్లయ్య, విద్యుత్ ఎఇ వెంకట మహేష్, ఎంఇఒ నిర్మల, ఐసిడిఎస్ సూపర్వైజర్ చంద్రకళ, పశు వైద్యాధికారి రామారావు, సర్పంచ్‌లు తిరుపాలు, ప్రసాద్, పిచ్చిరెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు

పెద్దదర్గాను సందర్శించిన గాయకుడు మనో

ప్రజాశక్తి-కడప అర్బన్: కడప అమీన్‌పీర్ దర్గాను ప్రముఖ గాయకుడు మనో, అయన భార్య జమిలా సందర్శించారు. బుధవారం దర్గా సాంప్రదాయ ప్రకారం నిర్వాహకులు వారికి స్వాగతం పలికారు. మనో పూల చాదర్ సమర్పించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. దర్గాను దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

పూల చాదర్ సమర్పిస్తున్న గాయకుడు మనో

మైదుకూరులో గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు, పాఠకులు

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

ఈనెల 14 నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మైదుకూరు గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆ మేరకు బుధవారం గ్రంథాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. వారోత్సవాలు ఈనెల 20 వరకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. 14న నెహ్రూ చిత్ర పటానికి నివాళులు, 15న పుస్తక ప్రదర్శన ఉంటుందన్నారు. 16న హై స్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామన్నారు. 17న శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ నాయకుల గురించి, 18న వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. 19న మహిళా దినోత్సవ సందర్భంగా ఇందిరాగాంధీ పటానికి పూలమాల వేసే కార్యక్రమం, 20న గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసే కార్యక్రమం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చాపాడులో.. ఈ నెల 14 నుండి 20 వరకు 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్థానిక గ్రంథాలయ అధికారి జె శివశంకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆయా పోటీల్లో పాల్గొనే ఆసక్తిగల విద్యార్థులు తమ పేర్లను గ్రంథాలయంలో నమోదు చేసుకోవాలన్నారు.

సింహాద్రిపురం: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు కోరగుంటపల్లె గ్రంథాలయ అధికారి గంగాదేవి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కథల పోటీలు, వ్యాసరచన, చిత్ర లేఖనంపై పోటీలు నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన విద్యార్థులకు చివరిరోజు ఈనెల 20న బహుమతులను అందజేస్తామన్నారు.

కొండాపురం: కొండాపురం శాఖ గ్రంథాలయంలో ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని అధికారి వరలక్ష్మి తెలిపారు. ఎంఇఒ-2 రామయ్య, ఎంపిడిఒ నాగప్రసాద్ గ్రంథాలయ వారోత్సవాల గోడపత్రాలను ఆవిష్కరించారు.

అంగన్వాడీ కేంద్రంలో చెడిపోయిన పాలు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని పిసి పల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చిన పాలు చెడిపోయాయి. లబ్ధిదారులకు మంగళవారం ఇచ్చిన 10ప్యాకెట్ల పాలల్లో ఆయిదు ప్యాకెట్లు చెడిపోయాయని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్యాకెట్లపై గడువు తేదీ ఉన్నా పాలు చెడిపోయాయి. పాలు సరఫరా చేసే ఏజెంట్లు తప్పిదం చేస్తున్నారేమోనని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా ఇలాంటి సమస్యలు వచ్చాయన్నారు. సంబంధిత అధికారులు దీనిపై దృష్టి పెట్టి మంచిపాలు సరఫరా అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

తారు వేయకుండా వదిలేసిన రోడ్డు

కంకర పరిచారు.. తారు మరిచారు

ప్రజాశక్తి - పెద్దముడియం

మండలంలోని పెద్దపసుపుల గ్రామం నుండి చాగలమర్రి వెళ్లే దారిలో సుమారు పది పల్లెల ప్రజలు నిత్యం పలురకాలుగా రాకపోకలు సాగిస్తూంటారు. అలాంటి మార్గంలో మరమ్మతుల పేరుతో రోడ్డు పలు చోట్ల తవ్వి కంకర పరిచారు. కంకరపరిచి మూడు నెలలు గడుస్తున్నా తారు వేయకుండా వదిలేశారు. ఉన్న రోడ్డును ఉండనివ్వకుండా తవ్వేసి.. తారు మరిచారని ప్రజలు, వాహనదారులు అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు సరిగాలేకపోవడం వల్ల భారీ వాహనాలు ఎదురుగా వస్తే పక్కకు వెళ్లినప్పుడు దుమ్ము లేస్తోందని, ఇతర వాహనదారులకు తీవ్ర అసౌ కర్యాంగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే తారు వేసి రోడ్డును పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

నేడు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - ఖాజీపేట

జడ్‌పి ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బాలల దినోత్సవం సందర్భంగా ఈ నెల 14న జడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ దివిజ సంపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత పాఠశాల నుండి రెండు గ్రూపులు ఉంటాయని, ఒక్కో గ్రూపులో ఆరుగురు విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ పిలుపునిచ్చారు.

బ్లాస్టింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి - వేముల

స్థానిక తుమ్మలపల్లి యురేనియం ప్రాజెక్ట్‌లో బ్లాస్టింగ్ ప్రక్రియ, ఎక్స్‌ప్లోసివ్ నిల్వ, రవాణాకు సంబంధించి డిజిఎంస్ కె.అప్పలనాయుడు సిబ్బందికి పలు సూచనలు చేశారు. తుమ్మలపల్లిలో జరిగే పనులను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సుమన్ సర్కార్, ఏజెంట్ కిషోర్ భగత్, మైన్ మేనేజర్ బదవత్ శ్రీను, సేఫ్టీ ఆఫీసర్ మోహన్‌రెడ్డి, బ్లాస్టింగ్ ఇన్‌ఛార్జిలు భద్ర, దాస్ , ఎన్.వి.రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్లు వాసుదేవరెడ్డి, ఎలా వర్షన్, రాములు, శ్రీనివాసరావు, ఫోర్మెన్‌లు, బ్లాస్టర్‌లు, యుసిఐఎల్, ఎస్ఎంఎస్ అధికారులు పాల్గొన్నారు.

వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - లింగాల

దోమకాటు ద్వారా అనేక రకాల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, అందులో ఒకటి బోధవ్యాధి అని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య అన్నారు. మండల పరిధిలోని చిన్నకుడాల గ్రామంలో బుధవారం బోధవ్యాధిపై సర్వే నిర్వహించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబరు నెలలో మండలంలో రెండు గ్రామాలను ఎంపిక చేసి బోదవ్యాధి సంబంధించి రక్తపూతలు సేకరిస్తామన్నారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ కుసుమకుమారి, సూపర్‌వైజర్ హాషియా బేగం సిహెచ్ఒ రేవతి, ఆరోగ్య కార్యకర్త నాగేశ్వరి పాల్గొన్నారు.

నీటి కోసం రైతుల ఎదురుచూపు

అసంపూర్తిగా ఎస్ఆర్‌బిసి పనులు.. సిఎం చంద్రబాబు దృష్టి సారించాలి

అసంపూర్తి పనులు.. ముళ్లపొదలతో ఉన్న ఎస్ఆర్‌బిసి కాలువ

ప్రజాశక్తి - పెద్దముడియం

ఎస్ఆర్‌బిసి ద్వారా సాగునీరందక మండలంలోని రైతులు దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. మండలంలోని కొండ సుంకేసుల, దిగువ కలువటాల, కొండ పాపాయిపల్లె, భూతమాపురం, భీమగుండం గ్రామాల రైతులు సాగునీటి కోసం ఎదరుచూస్తున్నారు. ఎస్ఆర్‌బిసి నుంచి నీరందక రైతులు కుదేలవుతున్నారు. అవుకు రిజర్వాయర్ నుంచి పేరు సోముల గ్రామం వరకు వచ్చి ఎస్ఆర్‌బిసి పనులు ఆగిపోయాయి. ఇలా అసంపూర్తి పనులతో సాగు చేసిన పంటలు నిలువునా ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ ప్రాంత రైతులు వర్షాధారంపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తారు. వర్షాభావ పరిస్థితులు, ఎస్ఆర్‌బిసి నుంచి సాగునీరందక రైతులు అప్పులపాలవతున్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి పెట్టి ఎస్ఆర్‌బిసి అసంపూర్తి పనులు పూర్తి చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. సమస్య పరిష్కారమైతే ఆయా గ్రామాలు సస్యశ్యాలం అవుతాయని పలువురు పేర్కొంటున్నారు. రైతులు అప్పుల నుంచి బయటపడుతారని అభిప్రాయపడుతున్నారు. రైతులను దృష్టిలో పెట్టుకుని స్థానిక ప్రజాప్రతినిధులు, సిఎం చంద్రబాబు చొరవ చూపాలని కొండ సుంకేసుల గ్రామ రైతులు, కూటమి నాయకులు కైపా అశోకవర్ధన్‌రెడ్డి, మేడగం వెంకట్రాంరెడ్డి, బి.చక్రపాణిరెడ్డి, మోహన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి కోరుతున్నారు.

మూడు పంటలు వేయొచ్చు..

ఎస్ఆర్‌బిసి నీళ్లు వస్తే మా ఊరిలో దాదాపు రెండు వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. తద్వారా మూడు పంటలను పండించేందుకు అవకాశం ఉంటుంది. ఎస్ఆర్‌బిసి నీళ్లు మా గ్రామానికి అందించేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

- కైపా అశోక్ వర్ధన్‌రెడ్డి, కొండసుంకేసుల

అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలి..

అసంపూర్తిగా నిలిచిపోయిన కాలువను పూర్తి చేయడం ద్వారా మా గ్రామమే కాక మరో ఐదు గ్రామాలకు నీళ్లు అందుతాయి. నీళ్ల కోసం ఈ ప్రాంత రైతులు ఎదురుచూస్తున్నారు. రైతులను దృష్టిలో ఉంచుకొని అధికారులు, ప్రజాప్రతినిధుల కృషి చేయాలి.

- మేడగ వెంకట్రాంరెడ్డి, కొండసుంకేసుల

ముంపు బాధితులకు న్యాయం చేయండి

- ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గండికోట, రాజోలి ప్రాజెక్టు ముంపు బాధితులకు నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి కోరారు. బుధవారం శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ మా నియోజకవర్గం కొండాపురం మండలంలో గండికోట ప్రాజెక్టు ముంపునకు గురైన 22 గ్రామాలకుగానూ మొదటి విడత ముంపునకు గురైన 14 గ్రామాల ప్రజలకు ఒక్కో లబ్ధిదారుడికి రూ.6 లక్షల 75 వేలు ప్రకారం చెల్లించారన్నారు. రెండో విడత 8 ముంపు గ్రామాలకుగాను ఒక్కో లబ్ధిదారుడికి రూ.10 లక్షలు ఇచ్చారు. మొదటి విడతలో 14గ్రామాలకుగాను 9,700 మంది లబ్ధిదారులకు ఒకొక్కరికి చెల్లించాల్సిన రూ.3లక్షల 25 వేల ప్రకారం సుమారు రూ.500 కోట్లు పెండింగ్‌లో ఉందన్నారు. ఈ మొత్తాన్ని కూడా ఈ బడ్జెట్‌లోనే కేటాయించాలన్నారు. పెద్దముడియం మండలం రాజోలి రిజర్వాయర్ కింద ముంపునకు గురైన గ్రామాల రైతులకు సంబంధించిన 4 వేల ఎకరాల వ్యవసాయ భూమికి ఎకరానికి రూ.12 లక్షల 50వేలు పరిహారం చెల్లించుటకు రెండేళ్ల కిందట అవార్డు పాస్ చేశారన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు,లోకేష్ జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు రాజోలు ముంపు గ్రామానికి సంబంధించిన రైతులు వారిని కలిసి తమకు రూ.12.50లక్షలు పరిపోదని, పరిహారం పెంచాలని కోరారని తెలిపారు. అందుకు వారు సానుకూలంగా స్పందించి ప్రభుత్వం రాగానే పరిహారం పెంచుతామని హామీ ఇచ్చారని తెలిపారన్నారు. ఈ మొత్తాన్ని కూడా ఈ బడ్జెట్‌లోనే కేటాయించి రాజోలు రిజర్వాయర్ రైతులకు వెంటనే పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఈ సభ ద్వారా ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని కోరుతున్నామన్నారు.

చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మాట్లాడుతున్న శివనారాయణ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి చేనేత కార్మికుడికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేస్తామని హామీ ఇచ్చినా ఇంత వరకు అమలు కావడం లేదని ఆ ప్రకారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరణాల శివ నారాయణ కోరారు. బుధవారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కష్టాలలో, నష్టాలలో ఉన్న నేతన్నలు కరెంటు ఛార్జీల మోతతో బిల్లులు కట్ట లేక ఉన్నారన్నారు. ముడిసరుకులు ధరలు విపరీతంగా పెరగడంతో పనులు జరుగక నేతన్న అల్లాడిపోతున్నారన్నారు. కనీసం ఈ పరిస్థితులలో 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇస్తే ఎంతగానో మేలవుతుందన్నారు. ప్రభుత్వం హామీ అమలు కోసం చేనేత కార్మికులు ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కొండయ్య పాల్గొన్నారు.

వెంకట్‌ను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వెంకట్‌ను సన్మానిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

పుట్టుకతోనే అంగ వైకల్యాన్ని కలిగి తల్లిదండ్రుల పట్టుదలతో వారి శిక్షణలో పలు కళలలో అసాధారణ ప్రతిభను కలిగి మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీతో అవార్డు పొంది ప్రధాని మోడీతో అభినందనలు అందుకున్న వెంకట్‌ను ప్రోత్స హించాలని అతని తల్లిదండ్రులు రాధాకృష్ణ, విశాలాక్షి కోరారు. ఆ మేరకు సాంస్కృతిక పర్యాటకశాఖా మంత్రి కందుల దుర్గేష్‌ను బుధవారం రాష్ట్ర సచివాలయంలో కలిసి వినతిపత్రం సమ ర్పించారు. మంత్రి వెంకట్ ప్రతిభను మెచ్చి సన్మానించారు. తమశాఖ కార్యక్ర మాల్లో వెంకట్ ప్రతిభను ప్రదర్శించేందుకు అవకాశం ఇవ్వడం తోపాటు పారితోషికాన్ని అందించి ప్రోత్సహిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

రైల్వేస్టేషన్‌లో కనీస వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. జమ్మలమడుగు రైల్వేస్టేషన్‌ను డివైఎఫ్ఐ నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ జమ్మలమడుగు స్టేషన్ మీదుగా ధర్మవరం, మచిలీపట్నం, నంద్యాల డేమో, గుంటూరు, తిరుపతి రైళ్లు తిరుగుతూన్నాయన్నారు. రైల్వే ప్రయాణికులకు కనీస సౌకర్యాలు స్టేషన్‌లో కనిపించడంలేదని ప్రయాణికులు వాపోతున్నారని తెలిపారు. తాగు నీటి సౌకర్యం లేదన్నారు. పైపు కనెక్షన్ ఉన్నా అందులో కుళాయి కనెక్షన్ లేదన్నారు. టాయిలెట్స్‌కు వెళ్లాలంటే బాత్రూమ్‌కు డోర్లు పగిలిపోయి అధ్వానంగా ఉన్నాయన్నారు. వెయిటింగ్ రూం సౌకర్యవంతంగా లేదన్నారు. వర్షం వస్తే స్టేషన్ ఉరుస్తోందన్నారు. స్టేషన్ మాస్టర్ రూం పెచ్చులూడి ఇబ్బందిగా ఉందన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. అధికారులు స్పందించి తక్షణమే సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, నాయకులు నరసింహ, విష్ణు, అంజి, నవీన్ పాల్గొన్నారు.

దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

నడింపల్లిలోని సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ హాస్టల్ 10 అడుగుల రక్షణ గోడను దౌర్జన్యంగా కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి యువజన సంఘాల నాయకులు కత్తి ఓబులేసు, ములపాకు ప్రతాపరెడ్డి, చెన్నమ్మ మాదిగ, జేస్తాది భాస్కర్, బయన్న, సంపత్, ఏసుదాసు కోరారు. ఆ మేరకు బుధవారం వారు కూల్చిన ప్రదేశాన్ని సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయులు కొంతమందితో కలిసి జెసిబితో దాదాపు 70 అడుగుల దూరం వరకు గోడను కూల్చారని ఆరోపించారు. సంబంధిత అధికారులెవ్వరికీ సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వ ఆదాయానికి గండిపడేలా వ్యవహరించారన్నారు. స్థానిక మాజీ కౌన్సిలర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఈ దౌర్జన్యానికి పాల్పడడం వల్ల ఇక్కడి విద్యార్థులు మరుగుదొడ్డులేక అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయులుస్వామి, స్థానిక ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమే

ప్రజాశక్తి - ఖాజీపేట

విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమని, క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంఇఒ నాగ స్వరలత తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పేరారెడ్డి కొట్టాల వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పద్మ మహిళా మండలి ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. క్రీడల్లో ఉన్నతంగా రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. మహిళా మండలి అధ్యక్షురాలు చిన్న అమ్ములు, ప్రిన్సిపల్ విజయ నరసింహ, వ్యాయామ ఉపాధ్యాయులు ఆనంద్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

వ్యవసాయ బోర్లు ఎండిపోకుండా చూడాలి

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని అమ్మగారిపల్లె, కత్తులూరు, పాములూరు గ్రామాల్లో నీటి ఎద్దడిని లేకుండా పార్నపల్లె డ్యాం నుండి చెరువులకు నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు ఇరిగేషన్ ఇఇ రాజశేఖర్ తెలిపారు. బుధవారం టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి అమ్మగారిపల్లె గ్రామ రైతులతో కలిసి ఆయనకు నీటి ఎద్దడి లేకుండా చూడాలని వినతిపత్రం అందజేశారు. నీటి ఎద్దడితో పంటలు ఎండి పోతున్నట్లు తెలిపారు. కొత్తపల్లె చెరువు నుండి అమ్మగారిపల్లె కాలువకు నీటిని సరఫరా చేయాలని కోరారు. అనంతరం ఇఇ రాజశేఖర్ మాట్లాడుతూ జిఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ పక్కనున్న కత్తులూరు, అమ్మగారిపల్లె, పాములూరు గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండడంతోపాటు బోర్లలో భూగర్భ జలాలు అడుగంటి పోయి, పంటలు ఎండి పోతున్నట్లు రైతులు తమ దృష్టికి తెచ్చారన్నారు. పిబిసి, పార్నపల్లె డ్యాం నుంచి నీటిని ప్రధాన కాలువ ద్వారా కొత్తపల్లె నుండి జిఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువలోకి వదిలి పెట్టితే దాదాపు 4 కిలోమీటర్ల మేరకు ఉన్న వ్యవసాయ బోర్లుకు భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. అమ్మగారిపల్లె కాలువకు నీటిని రెండు రోజుల్లోగా వదిలేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల రైతులు బిటెక్ రవికి, మండల కన్వీనర్ రామ మునిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాగూరు చంద్ర ఓబుల్‌రెడ్డి, నాగిరెడ్డి, గంగాధర్, శివ కేశవరెడ్డి, శ్రీరాంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా పార్వతి పరమేశ్వరుల కల్యాణం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని గురజాల గ్రామ సమీపంలోని గురుకుంట క్షేత్రంలో శ్రీపార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. బుధవారం ఉదయం కల్యాణ మండపాన్ని దొరసాని వెంకటేశ్వర్‌రెడ్డి కుమార్తె అనీషా ప్రారంభించారు. అనంతరం అనంతపురానికి చెందిన అర్చకులు రాజేష్ శర్మ నేతృత్వంలో పేరం సుదర్శన్‌రెడ్డి, గౌరీచే కల్యాణం నిర్వహించారు. గురజాలతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులు గురుకుంట క్షేత్రంలోని ఆంజనేయ స్వామి ఆలయం, శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి గురుకుంట క్షేత్రంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతన కల్యాణమండపం పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

కమనీయం వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

శ్రీశ్రీశ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి 416వ జయంతి మహోత్సవాల సందర్భంగా బుధవారం రాత్రి వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ కల్యాణాన్ని కమనీయంగా జరిగింది. ఉదయం స్వామివారి గుడి నుండి 416 కలశాలతో భక్తులు పార్కులో ఉన్న బ్రహ్మంగారి విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున మహానంది క్షేత్రం నుండి ఇఒ కాల్వ శ్రీనువాసులరెడ్డి, పండితులతో కలిసి పట్టువస్త్రాలు తెచ్చారు. మఠం పిట్‌పర్సన్ శంకర్ బాలాజీ మఠం సంప్రదాయాలతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేయించారు.

విద్యార్థి దశలో కష్టపడడం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

విద్యార్థి దశలో కష్టపడడం అలవర్చుకోవాలని జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయి శ్రీ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని లక్ష్మీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ముందస్తు బాలల దినోత్సవం కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో అందరికంటే చురుకుగా ఉంటేనే రాణించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ, తహశీల్దార్ రమాకుమారి, ఎంఇఒ రవిశంకర్, వంశీకృష్ణ, ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామసుందర్‌రెడ్డి, విశ్రాంత తెలుగు పండిట్ సాంబశివారెడ్డి, విశ్రాంత ఉత్తమ ఉపాధ్యాయులు శ్రీనివాసులు పాల్గొన్నారు. కార్యక్రమం పాఠశాలలో 1998లో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

ప్రయివేట్ పాఠశాలల్ని తనిఖీ చేయండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జిల్లాలో ప్రయివేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల స్థితిగతులను అధికారులు తనిఖీ చేయాలని ప్రయివేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ సంఘ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు బుధవారం పత్రికలకు విడుదల చేసిన ఓ ప్రకటనలో కోరారు. ఈ ఉపాధ్యాయులకు కనీస వేతనం, పి.ఎఫ్, ఈఎస్ఐ, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యాలు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖాధికారులు కేవలం ప్రభుత్వ పాఠశాలల్ని మాత్రమే తనిఖీలు చేసి, ప్రయివేట్ పాఠశాలల్ని గాలి కొదిలేశారన్నారు. వ్యాపార ధోరణితో పనిచేస్తున్న ప్రయివేట్ పాఠశాలలకు సొసైటీలు, ట్రస్టులు ఎందుకన్నారు. సేవా దృక్పథంతో నడిచేవారికి అవి అవసరమన్నారు. ప్రయివేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు జరుగుతున్న అన్యాయాన్ని నిలువరించాలని గడ్డం రాజు ప్రకటనలో కోరారు.

రాష్ట్రానికి ఎంపికైన కడప జిల్లా టీం

వాలీబాల్ అండర్-14 పోటీలో జిల్లా టీం ఎంపిక

ప్రజాశక్తి - చాపాడు

విజయనగరం జిల్లా భోగాపురంలో ఈనెల 9నుంచి 11వ తేదీ వరకు 68వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడోత్సవాలను నిర్వహించారు. అంతర్ జిల్లా వాలీబాల్ అండర్-14 పోటీలను నిర్వహించారు. ఈ క్రీడల్లో అండర్-14 బాలికల వాలీబాల్ విభాగంలో కడప జిల్లా విద్యార్థుల జట్టు ఫైనల్స్‌కు చేరుకుంది. గుంటూరు జిల్లా జట్టును ఓడించి ఛాంపియన్షిప్ సాధించింది. ఈ జట్టు సభ్యురాలిగా నరహరిపురం 9వ తరగతి విద్యార్థి శివచందన పోటీలో పాల్గొని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. ఈ ప్రతిభకు కారణమైన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు కుమారి జీ ప్రశాంతి, విద్యార్థి శివచందనను ప్రధానోపాధ్యాయులు కెకెఎ శాస్త్రి, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

పేదల అభ్యున్నతికి టిడిపి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి - వేంపల్లె

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి టిడిపి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని టిడిపి జిల్లా కార్యదర్శి ఎస్వీ జయరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక గండి రోడ్డులోని కార్యాలయంలో నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు ఆయన టిడిపి నేతలు ర్యాలీగా వచ్చి అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టిడిపి సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నేతలు మహమ్మద్ షబ్బీర్, బాల స్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి, ఆర్‌వి రమేష్, నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, శివ కృష్ణారెడ్డి, మల్లంగి గోపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పాములూరు చంటి, రెడ్డి కిషోర్, శేషారెడ్డి, వెంకటేష్, రామాంజీ, డీలర్ నాగిరెడ్డి, ఎస్వీ జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

జంబో టీంలా విప్‌ల నియామకం

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వం పాలనలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి 15 మంది విప్‌ల నియామకం హాస్యాస్పదంగా ఉందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విప్‌ల నియామకం చూస్తుంటే జంబో టీంగా ఉందన్నారు. విప్‌లకు విలువ లేకుండా పోయిందన్నారు. గతంలో ఎప్పుడూ ఇంతమంది విప్‌లు లేరని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 7వ అసెంబ్లీలో ఒకరు, 8వ అసెంబ్లీలో ఇద్దరు, 9వ అసెంబ్లీలో ముగ్గురు, 10,11వ అసెంబ్లీలో నలుగురు, 12వ అసెంబ్లీలో ఇద్దరు, 13వ అసెంబ్లీలో ఏడు మంది విప్‌లు ఉండేవారని చెప్పారు. విభజన అనంతరం 14వ అసెంబ్లీలో 7 మంది, 15వ అసెంబ్లీలో 8 మంది విప్‌లు ఉండగా ప్రస్తుతం ఏకంగా 15 మందిని నియమించడం శోచనీ యమన్నారు.

పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

పంటల బీమా చేసుకోవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

రబీలో సాగు చేసిన ఆయా పంటలకు సంబంధించి రైతులు బీమా చేసుకోవాలని ముద్దనూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య, ఎఒ వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. రాజుల గురువాయపల్లె గ్రామంలో బుధవారం ఎడిఎ ఆధ్వర్యంలో ఎఒ శనగ పంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనగ పంటలో వేరుకుళ్లు తెగులు రాకుండా తగు నివారణ చర్యలు పాటించాలన్నారు. పంట సాగు చేయకుండా బీమా చెల్లిస్తే ప్రీమియం డబ్బు నష్టపోతారని రైతులకు సూచించారు. నాయకులు శివశంకర్‌రెడ్డి, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంపై అవగాహన

ప్రజాశక్తి - వేంపల్లె

ఆయుర్వేద వైద్యంపై కూడా విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం ఆయుర్వేదం వైద్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమన్నారు. అనంతరం ఎంఐ లైఫ్‌స్టైల్ గ్లోబెల్ ప్రయివేటు లిమిటెడ్ కో-ఆర్డినేటర్ సాయి కీర్తన మాట్లాడుతూ ఆయుర్వేదం ద్వారా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ రావన్నారు. రోగం కూడా త్వరగా నయం అవుతుందని చెప్పారు. మానవుని జీవన విధానంలో ప్రస్తుతం ఎదురవుతున్న అనేక అనారోగ్య సమస్యలకు ఆయుర్వేదం ద్వారా పరిష్కారం అవుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, జిల్లా కో-ఆర్డినేటర్ విశ్వనాథ్, సూజాత, ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ సి.మల్లేశ్వరమ్మ, షఫీ ఉద్దీన్, రామకృష్ణ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి నిధులు కేటాయించడం హర్షణీయం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

హనుమంతు నాయక్

ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో గిరిజనుల సంక్షేమానికి రూ.7,557 కోట్లు కేటాయించటం హర్షణీయమని జమ్మల మడుగు నియోజకవర్గ టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షులు ఎస్.హనుమంతు నాయక్ తెలి పారు. బుధవారం ఆయన జమ్మలమడుగు విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి సారిగా ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్లో గిరిజనుల సంక్షేమం కోసం పెద్దపీట వేసిం దన్నారు. గిరిజన సామాజిక వర్గం తరుపున ముఖ్యమంత్రి చంద్రబాబుకు, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గిరిజనుల కోసం కేటాయించిన నిధులను పూర్తిగా వారి కోసమే సద్వినియోగం చేయాలని ఆయన కోరారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం

వేంపల్లె :స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో బుధవారం సాయంత్రం చోటుచేసుకున్న సంఘటన తృటిలో పెను ప్రమాదం తప్పింది. కడప రోడ్డు వైపు వెళుతున్న తుపాను వాహనం వేంపల్లెలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్దకు రాగానే డ్రైవర్‌కు ఫీట్స్ రావడంతో అదుపుతప్పింది. రోడు పక్క నిలిపిన మోటర్ బైకును ఢీకొంది. కొద్ది దూరం వెళ్లి వాహనం నిలిచి పోయింది. ఆ సమయంలో మోటర్ బైకు వద్ద, రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కొద్ది దూరంలో విద్యుత్ స్తంభం కూడా ఉంది. వాహనంలో ఉన్న వారికి కూడా ఎలాంటి ప్రమాదం జరగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ట్రాన్‌ఫార్మర్ అల్యూమినియం చోరీ

ప్రజాశక్తి - ముద్దనూరు

నల్లబల్లె సమీపంలోని దోబి ఘాట్ వద్ద ఉన్న సింగల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి అల్యూమినియం చోరీకి గురైనట్లు సిఐ దస్తగిరి తెలిపారు. విలువ దాదాపు రూ.10 వేలు ఉంటుందన్నారు. ఎఇ శ్రీని వాసరాజ వర్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.